జగన్ పాలనలో మహిళలకు సముచిత గౌరవం

- ఉండిలో జగనన్న సురక్ష కార్యక్రమంలో
- డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు


ఉండిలో ధ్రువపత్రాలు అందిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

ఉండి: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాతనే రాష్ట్రంలో మహిళలకు గౌరవం పెరిగిందని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. గురువారం ఉండిలోని 3వ సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి వివిధ రకాల ధ్రువపత్రాలను పీవీఎల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలు అదృశ్యం అవుతున్నారంటూ పనికిమాలిన విమర్శలు చేస్తున్న ప్రతిపక్షాలు ఒక్కసారి తమ పాలనను వెనక్కి తిరిగి చూసుకోవాలన్నారు. మహిళలపై లెక్కలేనన్ని దాడులు, దుశ్చర్యలు జరిగింది గత ప్రభుత్వంలోనే అని మండిపడ్డారు. ఇప్పుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో మహిళలను ఎంతో గౌరవిస్తూ వారిపేరుతోనే సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. అమ్మ ఒడి, అక్కాచెల్లెమ్మలకు డ్వాక్రా రుణమాఫీ (ఆసరా), కాపునేస్తం, జగనన్న చేయూత, పలురువు మహిళా రైతులకు రైతు భరోసాతో పాటుగా మరీ ముఖ్యంగా మహిళల పేరుతో ఇంటి స్థలం, ఇల్లు అందించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. మహిళను ఇంతకంటే మరెవ్వరూ రాష్ట్ర చరిత్రలో గౌరవించలేదని అన్నారు. గత ప్రభుత్వంలోని పెద్దలు మహిళాధికారులను సైతం కాలితో తన్నిన ఘటనలు ఉన్నాయని గుర్తు చేసుకోవాలన్నారు. మహిళలకు సొంత ఇంటి కలను నెరవేర్చి వారి కుటుంబంతో పాటు సంతోషంగా ఉండేలా జగనన్న వారికి తోబుట్టువు అయ్యారన్నారు. ఎన్నికలు వస్తున్నాయి కదా అని దొంగలంతా కలసి మళ్ళీ ప్రజల ముందుకు వస్తున్నారని, వారి నయవంచనను ప్రజలంతా గుర్తుంచుకోవాలన్నారు. జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధిని దృష్టిలో పెట్టుకోవాలన్నారు. గతంలో తొమ్మిదేళ్ల ప్రజలు అధికారం ఇస్తే దోచుకో, తినుకో, దాచుకో అన్నట్టు పాలన చేశారన్నారు. ప్రతి పైసా ప్రజాసంక్షేమానికి ముఖ్యమంత్రి ఖర్చుచేస్తుంటే నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని అన్నారు. కానీ సంక్షేమ పథకాలు అందుకుంటున్న ప్రజలకు ఎవరి మేలు చేస్తున్నారో వారికి తెలుసునని అన్నారు. ప్రజలంతా వైఎస్ జగన్ పక్షం ఉన్నారని, ఆయన రుణం తీర్చుకునేందు ప్రజలంతా ఎదురు చూస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, సర్పంచ్ కమతం సౌజన్య, ఉపసర్పంచ్ గొట్టుముక్కల కల్యాణ్‌వర్మ, రాష్ట్ర డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు, ఎంపీటీసీ సభ్యులు సత్యవతి, కరిమెరక చంద్రరావు, యేడిద వెంకటేశ్వరరావు, కమతం బెనర్జీ, కరిమెరక శివనాగరాజు, గలావిల్లి ధనుంజయ, బడుగు బాలాజీ, రాయి సతీష్, శేషాద్రి శ్రీను, అంగర రాంబాబు, గిరడ శ్రీను, అందుకూరి రాజు, బీ రామకృష్ణ, విద్యాసాగర్, ఆనందరావు, సిరికి ఎర్రయ్య, వాలర్‌లాల్ పాల్గొన్నారు.


భీమవరం 12వ వార్డులో ఓ మహిళకు సర్టిఫికెట్ అందజేస్తున్న కోడే యుగంధర్ తదితరులు

సురక్షతో పక్కాగా పథకాల లబ్ధి

భీమవరం (ప్రకాశం చౌక్): ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న సురక్ష పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ తోట భోగయ్య, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కోడే యుగంధర్ అన్నారు. పట్టణంలోని 27, 12 వార్డుల్లో గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష సభలకు హాజరైన భోగయ్య, యుగంధర్ లబ్ధిదారులకు పలు రకాల సర్టిఫికెట్లు అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందుకోలేని వారి కోసం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని తీసుకువచ్చి సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. 11 రకాల సర్టిఫికెట్లను ప్రభుత్వం ఉచితంగా అందస్తోందన్నారు. ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ కృషి వల్లనే భీమవరం నియోజకవర్గం అభివృద్ధి చెందిందన్నారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్లు నల్లం రాంబాబు, చెల్లబోయిన సూర్యప్రకాష్, నాయకులు నడింపల్లి అశోక్ కుమార్‌రాజు, ముల్లి నరసింహమూర్తి, ఆయా కార్యక్రమాల్లో నందమూరి ఆంజనేయులు, పాలవెల్లి మంగ, కందికట్ల ఎడ్వర్డ్, పేరిచర్ల సత్యనారాయణరాజు, యర్రంశెట్టి చందు, రాంబాబు, పతివాడ రాజేంద్ర, గంటా సుందర్‌కుమార్, కరుకువాడ పోతురాజు, ఏడుకొండలు, ఆకుల దుర్గ, జట్ల రాంబాబు, పతివాడ శేషు, కొక్కిరి శ్రీను, కాసారపు నరసింహమూర్తి, కరుకు కొండయ్య, పోకూరి సాయి, కట్టా మధు, తాడి వెంకటేశ్వర రెడ్డి, జెట్టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


బేతపూడిలో సర్టిఫికెట్లు అందజేస్తున్న ఆర్డీవో దాసి రాజు, ఎంపీపీ పి.విజయనరసింహరాజు

ప్రతి కుటుంబానికి మేలు

భీమవరం అర్బన్: ప్రభుత్వం పథకాలకు అర్హులైనా చిన్న చిన్న కారణాల వల్ల లబ్ధి చేకూరని వారికి మేలు చేసేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం వరం లాంటిదని ఆర్డీవో దాసి రాజు అన్నారు. భీమవరం మండలంలోని బేతపూడి గ్రామంలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా అర్హులైన లబ్ధిదారులకు 11 రకాల సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో దాసి రాజు, ఎంపీపీ పేరిచర్ల విజయనరసింహరాజు మాట్లాడుతూ ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదిగేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో పథకాలు రూపొందించి అమలు చేస్తున్నారన్నారు. అమ్మ ఒడి, జగనన్న చేయూత, రైతు భరోసా, విద్యా దీవెన, వసతి దీవెన తదితర పథకాలకు కుల, ఆదాయ, జనన, మరణ, ఫ్యామిలీ తదితర సర్టిఫికెట్లు అవసరమవుతాయన్నారు. గతంలో సర్టిఫికెట్లు చిన్న చిన్న కారణాల వల్ల రాకపోవడంతో ప్రభుత్వ పథకాల లబ్ధి పొందలేకపోయేవారన్నారు. వారికి కూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లబ్ధి చేకూర్చేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా 11 రకాల సర్టిఫికెట్లను అందజేస్తున్నారన్నారు. వలంటీర్లు, మండల శాఖాధికారులు ఇంటింటికి తిరిగి అర్హులైన వారిని గుర్తించి సర్టిఫికెట్లు ఉచితంగా ఇస్తున్నామన్నారు. ఈ సర్టిఫికెట్లు భద్రపరుచుకుని అవసరమైనప్పుడు ఇవ్వాలన్నారు. అనంతరం 2వేల 500 వివిధ రకాల సర్టిఫికెట్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు కాండ్రేగుల నరసింహరావు, తహసీల్దార్ వై.రవికుమార్, జేసీఎస్ మండల కన్వీనర్ కోమటి రాంబాబు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు కొట్టి కుటుంబరావు, కడియం వెంకటేశ్వర్లు, సమతం ఉమా, బుంగా ప్రహ్లాదుడు, సర్పంచ్‌లు ఆరేటి వీరాస్వామి నాయుడు, లాజర్, తదితరులు పాల్గొన్నారు.

దెయ్యాలతిప్పలో..

దెయ్యాలతిప్ప గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు పాల్గొని ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె.వెంకటలక్ష్మి, సర్పంచ్ తిరుమాని శ్రీనివాస్, అల్లూరి శ్రీహరిరాజు, రామాని నరసింహస్వామి, బొమ్మిడి బాబు రాజేంద్రప్రసాద్, సంధి యోహాన్ పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి


బేతపూడి హైస్కూల్లో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో మహేశ్వరరావు

భీమవరం అర్బన్: విద్యార్థుల ఆరోగ్యంపై తల్లిదండ్రులు, ఆరోగ్య సిబ్బంది శ్రద్ధ తీసుకోవాలని డీఎంహెచ్‌వో మహేశ్వరరావు అన్నారు. భీమవరం మండలంలోని బేతపూడిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అంగన్‌వాడీ సెంటర్లలో బుధవారం డీఎంహెచ్‌వో మహేశ్వరరావు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆయన స్కూల్ విద్యార్థులు రక్తహీనతతో బాధపడుతున్నవారి వివరాలు అడిగి తెలుసుకుని వైద్య సిబ్బంది మందులు ఏ విధంగా ఇస్తున్నారో ఆరా తీశారు. అంగన్ వాడీ సెంటర్లలో విద్యార్థులకు పౌష్టికాహారం ఎంత మోతాదులో ఇస్తున్నారు. ఆరోగ్య సిబ్బంది ఎన్ని రోజులకు వచ్చి విద్యార్థులను పరీక్షిస్తున్నారని అక్కడున్న సిబ్బంది, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా ఆన్‌లైన్‌లో టెలిమెడిసిన్, ఎనీమియాకు సంబంధించి డేటా పరిశీలించారు. బేతపూడిలో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా అక్కడ ఏర్పాటు చేసి మెడికల్ క్యాంప్ పరిశీలించారు. డీఎంహెచ్‌వో మహేశ్వరరావు వెంట తుందుర్రు పీహెచ్‌సీ వైద్యాధికారిని డాక్టర్ అరుణ కుమారి, ఏఎన్ఎమ్ ఎమ్ స్వరాజ్యం, సూపర్ వైజర్ సాయికుమార్ వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించాలి


కళాశాలలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఆకివీడు: నైతిక విలువలు పెంపొందించే విధంగా విద్యా బోధన చేపట్టాలని జిల్లా విద్యాశాఖాధికారి ఆర్వీ రమణ పిలుపునిచ్చారు. లయన్స్ ఆదర్శ క్లబ్ ఆధ్వర్యంలో జెడ్పీ స్కూల్‌లోని ప్రభుత్వ ఇంటర్ కళాశాలలోని విద్యార్థులకు పుస్తకాల్ని గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో డీఈఓ మాట్లాడుతూ గురువుల్ని, తల్లిదండ్రుల్ని గౌరవించాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే మంచి పౌరులుగా ఎదగలేరన్నారు. మంచి పౌరులుగా పది మందికి ఉపయోగపడాలని పిలుపునిచ్చారు. లయన్స్ జిల్లా గవర్నర్ గట్టెం మాణిక్యాలరావు మాట్లాడుతూ సహాయం పొందడమే కాదు, సహాయం చేయగలిగే సత్తాను భవిష్యత్‌లో విద్యార్థులు పొందాలన్నారు. వాతావరణం కాలుష్యం కాకుండా మొక్కల్ని నాటాలని సూచించారు. ఈ సందర్భంగా ఆవరణలో మొక్కల్ని నాటారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, ఎంఈఓ రవీంద్ర, లయన్స్ ఆదర్శ క్లబ్ అధ్యక్షుడు మోటుపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శి ఎండీ షరీఫ్, కోశాధికారి ఎస్‌వీజీ అనిల్ కుమార్, నెల్లి సతీష్, రీజనల్ చైర్మన్ దాట్ల రామరాజు, పల్లి అప్పిరెడ్డి, పేర్ని సుబ్రహ్మణ్యం, మురళీకృష్ణ, కాకర్ల రాజరాజేశ్వరి, హెచ్ఎం కం ప్రిన్సిపాల్ పెద్దిరాజు, ఉపాధ్యాయుడు ముత్యాల వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

స్పందనలో కుళాయి సమస్య పరిష్కారం


శృంగవృక్షంలో ఏర్పాటు చేసిన కుళాయి

పాలకోడేరు: శృంగవృక్షంలోని 4వ వార్డులో సుమారు పది నెలల క్రితం నీళ్ల కుళాయి మరమ్మతులకు గురై సుమారు 11 కుటుంబాల వారు మంచినీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై స్థానిక మహిళలు రెండు మూడు సార్లు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. కొంతమంది గ్రామ పెద్దల దృష్టికి సమస్యను తీసుకువెళ్లినా ఫలితం లేదు. దీంతో వార్డు మెంబర్ సోము దుర్గాభవాని సమస్యగా చెప్పగా, ఆయన సూచనతో పంచాయతీ కార్యాలయంలో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అయినా పట్టించుకోలేదు. చివరకు గ్రామాభివృద్ధి కమిటీ జోక్యం చేసుకుని, సోమవారం స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో అక్కడ సమస్య పరిష్కారం అయ్యింది. పంచాయతీ సిబ్బంది వచ్చి కుళాయి బిగించారు. అక్కడి మహిళలు సంతోషం వ్యక్తం చేసి, గ్రామాభివృద్ధి కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు.

వరి చేలల్లో ముంపు నీరు మళ్లించండి


అప్పారావుపేటలో ముంపు చేలను పరిశీలిస్తున్న ఏడీఏ కేఎస్ఎస్ శ్రీనివాస్, ఏఓ ప్రియాంక

ఆకివీడు: వర్షాలు తగ్గుముఖం పట్టిన తరువాత ముంపు నీరు బయటకు మళ్లించేలా చర్యలు తీసుకోవాలని ఏడీఏ కేఎస్ఎస్ శ్రీనివాస్ రైతులకు సూచించారు. మండలంలోని గుమ్ములూరు, అప్పారావుపేట గ్రామాల్లో ముంపునకు గురవుతున్న వరి చేలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ చినకాపవరం డ్రెయిన్‌లో తూడు సకాలంలో తొలగించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తూడు తొలగింపునకు ప్రభుత్వం నిధులు కేటాయించి, కాంట్రాక్టర్‌కు అప్పగించినప్పటికీ పనులు చేపట్టడం లేదన్నారు. వర్షాలు కురిసిన తరువాత డ్రెయిన్‌లోని తూడుపై మందు పిచికారీ చేశారని, పర్లాంగు దూరం కూడా తూడు తొలగించలేదని ఆరోపించారు. చినకాపవరం లాకులను ఎత్తి ముంపు నీటిని వదలడం వల్ల డ్రెయిన్‌లో ప్రవాహం మందగించి ముంపునకు గురిచేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడీఏ మాట్లాడుతూ ముంపు నీరు త్వరితగతిన బయటకు వెళ్లడం ద్వారా నాట్లు బతికే అవకాశం ఉందని, లేకుంటే త్వరగా నాట్లు వేసుకోవాలని సూచించారు. మండల వ్యవసాయాధికారిణి ఎమ్మార్పీ ప్రియాంక మాట్లాడుతూ మండలంలో 807 ఎకరాల్లో నాట్లు వేశారని, 432 ఎకరాల్లో నాట్లు మునిగిపోయాయని వివరించారు. కార్యక్రమంలో రైతులు మల్లారెడ్డి శేషమోహనరంగారావు, మేడవరపు సుబ్బారావు, గ్రామ వ్యవసాయ అసిస్టెంట్‌లు, రైతులు పాల్గొన్నారు.

రైతులకు ప్రకృతి వ్యవసాయ కిట్ల పంపిణీ


కాంభోట్లపాలెం విత్తనాల కిట్లతో రైతులు

యలమంచిలి: ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సాహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా దళిత రైతులకు రూ.10 వేలు విలువైన విత్తనాలు, వ్యవసాయ పరికరాల కిట్లు అందజేస్తుందని మండల వ్యవసాయాధికారి చిందులూరి దేవి అన్నారు. ఈ పథకంలో భాగంగా గురువారం కాంభోట్లపాలెం రైతు భరోసా కేంద్రం వద్ద దళిత రైతులకు 14 రకాల విత్తనాల కిట్లను వ్యవసాయ సలహా మండలి యలమంచిలి మండల చైర్మన్, బూరుగుపల్లి సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ బొంతు వెంకట కర్ణారెడ్డి, సర్పంచ్ అనిశెట్టి మల్లిక చేతుల మీదుగా పంపిణీ చేశారు. త్వరలో ప్రకృతి వ్యవసాయంలో కషాయాలు తయారీకి అవసరమైన డ్రమ్ములు, టార్పాలిన్‌లు, లింగా కర్షక బుట్టలు, జిగురు అట్టలు అందజేస్తామని చెప్పారు. ఎంపీటీసీ సభ్యురాలు కంబాల సత్యశ్రీ, నాయకులు మంద హరికుమార్, శీలం వీరబాబు, డి.మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

సివిల్ రైట్స్ డే

పాలకోడేరు: దళిత పేటల్లో సమస్యలు కోకొల్లలుగా ఉంటున్నాయని, ఎస్సీ ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం పటిష్టంగా అమలు జరపాలని, ఈ కేసుల నమోదులో జాప్యం జరగడం వల్ల బాధితులకు పరిహారం సకాలంలో అందడం లేదని జిల్లా ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు పోన్నమండ బాలకృష్ణ పేర్కొన్నారు. గురువారం పాలకోడేరులో జరిగిన సివిల్ రైట్స్‌డేలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సర్పంచ్ ఇంజెటి మరియమ్మ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ షేక్ హుస్సేన్, ఎస్సై నాళం శ్రీనివాసరావు, ఎంపీడీఓ నూకల మురళీ గంగాధరరావు, పంచాయతీ కార్యదర్శి సీహెచ్ రమాలీలా, వార్డ్ మెంబర్లు పాల్గొన్నారు.

పీవీఎల్ పరామర్శ


బోసురాజు కుటుంబాన్ని పరామర్శిస్తున్న పీవీఎల్

ఆకివీడు: సిద్ధాపురంలో వైఎస్సార్ సీపీ నాయకుడు ఇందుకూరి బోసురాజు కుటుంబాన్ని గురువారం డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు పరామర్శించారు. బోసురాజు సతీమణి రామ సీత ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బోసురాజు ఆయన కుమారులు శేషాద్రిరాజు, తాతరాజు, సోదరులు, నాయకులు నారాయణ రాజు, గాంధీరాజు, సుబ్బరాజులను పరామర్శించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు వేగేశ్న వెంకట్రాజు (యండగండి శ్రీను), త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళీ, నగర పంచాయతీ వైస్ చైర్మన్ పుప్పాల పండు, మంతెన సునీల్‌రాజు, సుభీరాజు పరామర్శించారు.

మణిపూర్ ఘటనపై సర్వత్రా నిరసనలు


భీమవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవ సంఘాలు


జక్కరం సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

సాక్షి, భీమవరం: మణిపూర్‌లో దమనకాండను అదుపుచేసి శాంతిని నెలకొల్పాలని భీమవరంలో గురువారం క్రైస్తవ సంఘం నాయకులు శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించారు. ఫ్రీడమ్ ఫర్ క్రిస్టియన్ ఇంటిగ్రేటీ (ఎఫ్ఎఫ్‌సీఐ) అధ్వర్యంలో ఆర్‌సీఎం చర్చి నుంచి ఓవర్ బ్రిడ్జి, ప్రకాశం చౌక్, అంబేడ్కర్ సెంటర్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఎఫ్ఎఫ్‌సీఐ వ్యవస్థాపకుడు పుట్టా పీటర్, పొలిటికల్ ప్రెసిడెంట్ జి.రాజేష్ ఖన్నా మాట్లాడుతూ మతోన్మాత ఉగ్రవాదుల దాష్టీకంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళలను వివస్త్రలను చేసి ఊరేగించడం దారుణమని, పాస్టర్లను, దేవాలయాలను లక్ష్యంగా చేసుకుని చేసిన దాడికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. స్టేట్ ప్రెసిడెంట్ ఎండీ ఇశ్రాయేల్, జిల్లా ప్రొటెక్షన్ జె.స్టేన్లీథామస్, వెల్ఫేర్ ప్రెసిడెంట్ పి.ఐజక్‌పాల్, స్టాన్లీ, చిరంజీవి, సువర్త రాజు, ఎండీ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

మణిపూర్‌లో శాంతి నెలకొల్పాలి

కాళ్ల: మణిపూర్‌లో జరుగుతున్న మారణకాండ, మహిళలపై అత్యాచారాలు, హత్యలను జక్కరం లూథరన్ ప్యారిస్ సంఘస్తులు ఖండించారు. జక్కరంలో గురువారం జీడి కరుణాకరన్ అధ్యక్షతన ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. డెలిగేట్ చిలకపాటి సుందరరావు మాట్లాడుతూ వివిధ మతాలు, తెగల మధ్య విద్వేష పూరిత హింసాకాండ చెలరేగుతోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలని విజ్ఞప్తి చేశారు. అల్లా డెలిగేట్ దొండపాటి రవి చంద్రన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన కొత్త సీఐ


ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఐ శ్రీనివాస్

సాక్షి, భీమవరం: విధి నిర్వహణలో చిత్తశుద్ధితో పనిచేసి ప్రజల్లో మంచి పేరు తెచ్చుకోవాలని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరం టుటౌన్ సిఐగా బాధ్యతలు స్వీకరించిన జి శ్రీనివాస్ గురువారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భీమవరం జిల్లా కేంద్రంగా మారడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

బాధ్యతల స్వీకరణ

తొలుత భీమవరం టుటౌన్ సీఐగా జి.శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ సీఐగా పనిచేసిన బి.కృష్ణకుమార్ కైకలూరు రూరల్‌కు బదిలీ కావడం తెలిసిందే.

రైతులకు కేంద్ర ప్రభుత్వం పెట్టుబడి సహాయం

సాక్షి, భీమవరం: దేశంలో 8.5 కోట్ల మంది రైతులకు 14వ విడత కిసాన్ సమ్మాన్ నిధి పథకంలో రూ.17 వేల కోట్లు పంపిణీ చేస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ పి.సత్యనారాయణ చెప్పారు. భీమవరంలోని కిసాన్ సమృద్ధి కేంద్రం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు లు అల్లూరి సాయి దుర్గరాజు, భీమవరం అసెంబ్లీ కన్వీనర్ కాయిత సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రంగసాయి, కృష్ణలకు 'కలాం' అవార్డులు

భీమవరం(ప్రకాశం చౌక్): భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ అబ్దుల్ కలాం జీవిత సాఫల్య పురస్కారాలు విజయవాడ ఐలపురం కాన్ఫరెన్స్ హాల్లో కలాం వర్ధంతి సందర్భంగా పశ్చిమ గోదావరి జిల్లా నుంచి సంఘ సేవకుడు చెరుకువాడ రంగసాయి, వాస్తు సిద్ధాంతి బ్రహ్మశ్రీ ర్యాలీ కృష్ణలకు అందించారని పిలంత్ర ఫిస్ట్ సొసైటీ విజయవాడ చైర్మన్ డాక్టర్ ఎ.రాజు గురువారం తెలిపారు. వీరు చేస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డులను అందిస్తున్నామని తెలిపారు. సామాజిక సేవా అవార్డులను భీమవరం ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యాపకురాలు ఎ.ధనలక్ష్మి, సీహెచ్ గంగాధరరావులకు అందించామని తెలిపారు. అవార్డు గ్రహీతలను పలువురు అభినందించారు.

వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

భీమవరం అర్బన్: గత నాలుగు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ వై.రవికుమార్ కోరారు. భీమవరంలో గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా మట్టి ఇళ్లలో నివసించేవారు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలన్నారు. అంతేకాకుండా సముద్రపు పోటు, పాటు కారణంగా డ్రెయిన్లు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని, మత్స్యకారులు వేటకు వెళ్లకూడదన్నారు. తీర ప్రాంత గ్రామస్తులు వర్షాలతో అప్రమత్తంగా ఉండాలని కోరారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం


అజ్జమూరులో పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

ఆకివీడు: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ప్రిన్సిపాల్ కె.సుజాత చెప్పారు. అజ్జమూరులోని వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు గురువారం ఎన్ఎస్ఎస్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి ఇల్లు, గ్రామం పరిశుభ్రంగా ఉండాలన్నారు. పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలని సూచించారు. ఇంట్లో వాడిన చెత్తను రోడ్లపై పారబోయకుండా ప్రభుత్వం అందజేసిన డస్ట్‌బిన్నులలో వేసి, పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలని సూచించారు. పంచాయతీ ఆవరణలో విద్యార్థులు పిచ్చి మొక్కల్ని తొలగించి, వ్యర్థాలను తొలగించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ కె.ఆనందకుమార్, స్వచ్ఛ భారత్ సమన్వయకర్త డాక్టర్ టీ.ఓగేశ్వరరావు, అధ్యాపకులు, సర్పంచ్ చెలంకూరి చలపతిరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

1 నుంచి సృజన బాలవికాస్ శిక్షణ

సాక్షి, భీమవరం: సర్వోదయ మండలి ఆధ్వర్యంలో ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రకృతి పరిసరాల పరిశీలన, శాస్త్రీయదృక్పథం పెంపొందించడానికి సృజన బాలవికాస్ శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్లు సర్వోదయ మండలి జిల్లా కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు గురువారం చెప్పారు. జిల్లాలోని 100 పాఠశాలల్లో ఎంపిక చేసిన విద్యార్థులకు ఆగస్టు నుంచి శిక్షణ ఇస్తామన్నారు. అలాగే జిల్లాలో ప్రభుత్వ పరంగా ఏర్పాటు చేసే సైన్స్ పార్క్‌కు సహకారం అందిస్తామని ప్రసాదరాజు తెలిపారు.

గుర్రపుడెక్క తొలగింపు


పొక్లెయిన్‌తో డ్రెయిన్‌లో తూడు తొలగిస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: భీమవరం మండలంలోని తాడేరు, శ్రీరామపురం, వెంప, దిరుసుమర్రు, యనమదుర్రు గ్రామాల మీదుగా వెళ్లే గునుపూడి సౌత్ డ్రెయిన్‌లో పేరుకుపోయిన గుర్రపుడెక్క, కిక్కిస, తూడును పొక్లెయిన్‌తో డ్రెయినేజీ శాఖ అధికారులు తొలగిస్తున్నారు. ఈ డ్రెయిన్ ఆనుకుని సుమారు 12 వేల ఎకరాల్లో వరి సాగు, చేపలు, రొయ్యల చెరువులు ఉన్నాయి. వర్షాకాలం కావడం, భారీ వర్షాలు కురవడంతో గుర్రపుడెక్క, కిక్కిస, తూడు పేరుకుపోవడంతో వరదనీరు ఎక్కడికక్కడ నిలిచి వరి చేలు మునిగిపోతుండటంతో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఆదేశాలతో వరద నీరు దిగువకు పారేందుకు అధికారులు కిక్కిస, గుర్రపుడెక్కను తొలగిస్తున్నారు. దీంతో ఆయా గ్రామాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన


వ్యాధులపై విద్యార్థులకు వివరిస్తున్న దృశ్యం

పాలకోడేరు: విస్సాకోడేరులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. విద్యార్థులందరికీ ఎత్తు, బరువు, హిమోగ్లోబిన్ శాతం తెలిపే రక్తపరీక్షలు నిర్వహించి హిమోగ్లోబిన్ శాతం తక్కువగా ఉన్న విద్యార్థులకు హిమోగ్లోబిన్ పెరగడానికి, నువ్వులు–బెల్లం, వేరుశనగ–బెల్లం, కొబ్బరి–బెల్లం, మినప సున్నుండలు, ఖర్జురాలు, మునగాకు, కరివేపాకు, పొన్నగంటికూర ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. హెల్త్ సూపర్‌వైజర్లు శ్రీనివాస్, నాగమణెమ్మ, లలిత, వాణి, హెల్త్ అసిస్టెంట్ వైఎస్సార్ గోపాలకృష్ణ, ఏఎన్ఎంలు హేమ, భవాని, ఆశ సిబ్బంది, పాఠశాల హెచ్ఎం చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రైతుకు చేదోడుగా పీఎం కిసాన్ సమ్మాన్ నిధి


కిసాన్ సమ్మాన్ నిధి పథకం నిధుల విడుదల ప్రచారాన్ని తిలకిస్తున్న అధికారులు, రైతులు

ఆకివీడు: రైతుకు చేదోడుగా పీఎం కిసాన్ సమ్మాన్ నిధులు ఉపయోగపడుతున్నాయని బీజేపీ మండల అధ్యక్షులు నేరెళ్ల పెదబాబు చెప్పారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం 14వ విడత నిధులను రాజస్థాన్‌లో జరిగిన కార్యక్రమంలో పీఎం నరేంద్ర మోదీ విడుదల చేసిన కార్యక్రమ ప్రచారాన్ని స్థానిక ఏడీఏ కార్యాలయం వద్ద గురువారం రైతులు తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులను సబ్సిడీపై అందజేసున్నారని, అన్ని కంపెనీల యూరియా ఎరువును భారత్ పేరునే విక్రయించే విధంగా నామకరణం చేశారన్నారు. ఈ పథకం ద్వారా మండలంలో 2,521 మందికి రూ.2 వేలు చొప్పున రైతుల ఖాతాలో జమ అవుతుందని ఏడీఏ కేఎస్ఎస్ శ్రీనివాస్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఓ ప్రియాంక, పట్టాభి, రైతులు పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించారంటూ ఫిర్యాదు

సాక్షి, భీమవరం: తాను పనిచేస్తున్న రెస్టారెంట్ వద్దకు వచ్చిన ఓ మహిళ అసభ్యంగా మాట్లాడుతూ తనను కులం పేరుతో దూషించారంటూ నరసయ్య అగ్రహారం చెందిన ముప్పిడి శిరోమణి వన్‌టౌన్ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపిన వివరాలు ప్రకారం భీమవరం ఆర్టీసీ డిపో వద్ద ఉన్న అన్నపూర్ణ రెస్టారెంట్లో శిరోమణి పనిచేస్తోందని, అయితే యర్రంశెట్టి మహేశ్వరి అనే మహిళ గురువారం రెస్టారెంట్ వద్దకు వచ్చి అక్కడ ఉన్న వంటలు కూరలు పాడుచేసి తనని దూషించారని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.